# గౌతమీగాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

అన్నీ హైస్కూళ్ళవంటిదీ కాదు. నేషనల్ హైస్కూలు; దానికి చరిత్ర ఉంది. ప్రతిష్ఠ ఉంది.

అక్కడ వేదుల సత్యనారాయణశాస్త్రిగారు కొన్ని రోజులు - నేను చాలా రోజులు. పనిచేసి మంచిచోట పనిచేసిన తృప్తి పొందాం.

అక్కడే చదివి తర్వాత అక్కడే తెలుగు పండితులైనవారు రామారావుగారు.

ఆయన పూర్వాంధ్ర కవితాప్రియులు: ఆశుకవి. మా భావధారలు విభిన్నమైనవి మా ప్రభావాలు విద్యార్థులమీద చాలా బలంగా వుండేవి.

మా దగ్గర చదివి స్కూలుఫైనల్ పాసయి కాలేజీల్లో చదివే ఆ వూరి విద్యార్థులు కొందరు ఒక వేసవి సెలవుల్లో బ్రహ్మాండమైన సాహిత్య సభలు చెయ్యాలని తలపెట్టారు.

చందాలు పోగుచేశారు. దేశంలో లబ్ధప్రతిష్ఠుల్ని ఆహ్వానించారు. కార్యక్రమం సిద్ధం చేశారు. కథ, నాటకం, కవిత, విమర్శ మొదలైన ప్రక్రియలమీద చర్చలు, ప్రసంగాలు చేయించాలని వాళ్ళ సరదా. రెండు రోజులు సభలు—

'నిలయవిద్వాంసులు'కాక రాజమండ్రి, కాకినాడ వగైరా పట్టణాలనుంచి వక్తలు విచ్చేశారు. కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకి భవనం మేడమీద సభా సన్నాహం.

ఉదయం స్వాగతాలు, ఊరేగింపులు, ఉపోద్ఘాతాలు. అయాయి.

తాము ఉద్దేశించిన విషయాలలో, ఒక దానిమీద నన్ను ప్రసంగించమన్నారు.

సభా నిర్వాహకులు అనుభవంలేని ఔత్సాహికులు. రెండు భిన్నప్రవాహాల సంఘటన, సంఘర్షణ, అక్కడ జరగడం నాకిష్టం లేదు.

విడివిడిగా మాట్లాడించి వాటి విలువల్ని మీ మనస్సులో తైపారు వేసుకోమన్నాను. వాళ్ళకు నా బోధ నచ్చలేదు.

రెండూ ఒకేసారి వినదలచుకున్నారు.

"మంచిది - నేనేమీ మాట్లాడదలచుకోలే"దన్నాను.

ఎన్నోవిధాల నన్నొప్పించాలని చూశారు. నొప్పించారుగాని, ఒప్పించలేదు. సభలకు హాజరవడానికి మాత్రం ఒప్పుకుని వెళ్ళాను.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కథల సభకు అధ్యక్షులు. కథారచనలో తన అనుభవాలు, రచనా విధానంలో వస్తున్న మార్పులూ విశదపరుస్తూ చక్కగా ప్రసంగించారు.

మధ్యాహ్నం నాలుగు గంటలకు సభ మళ్ళా ప్రారంభం అయింది.

అధ్యక్షులు ఒక ప్లీడరుగారు. వక్త రామరాయ కవిగారు.

రామరాయకవిగారిని రామయమంత్రి అనడం మా వేదుల సరదాల్లో ఒకటి. కవి

## దూదిపుల్లి

గారు తీవిగా నడచి వస్తూఉంటే వేదుల శ్రీనాథుడి "మా రామయమంత్రి భోజన పరాక్రమ మేమని చెప్పవచ్చు...." అనే పద్యం అందుకుని మమ్మల్నందర్నీ నవ్వించేవాడు.

ముందు రామరాయకవిగారు లేచారు. కవిగారిది మంచి విగ్రహం. గుబురు మీసాలు, ఖరీదైన చొక్కా, పూర్వాస్థాన కవులను జ్ఞాపకం చేస్తాయి.

రెండు పద్యాలు విసిరేరు. చదివే ఒడుపుంది; చిన్నరాగం వుంది; ఆకర్షించే గుణం వుంది. కాని - ఏమి ప్రసంగించాలో ఆలోచించినట్టు కనపడదు.

పూర్వకవుల పద్యాలు తనకు నచ్చినవి, వచ్చినవి, చదువుతూ మధ్యమధ్య మాటలు చెబుతూ, బండి లాగించారు. ఇంతకీ సభ్యులాశించిన పూర్వకవితా హృదయం ఏమిటీ? అన్నది తేలలేదు. సభాసారులకు ఆ బాధ లేదు. ప్రతి పద్యానికీ చప్పట్లు కొట్టారు.

కవిగారి అభిభాషణం అయింది.

వేదులవారు తరవాత వక్త.

వేదులను చూస్తే నవ్వొచ్చింది.

కొంటెతనమంతా పెదవుల్లో బిగించి అమాయికంగా ఏమెరగనట్టు మొదలెట్టాడు.

"కవితా ప్రవాహంలో ఇంతవరకు కొట్టుకుపోయాను. నేను భద్రాచలంవాణ్ణి. ఈత బాగావచ్చు. అయితేయేం ఆవలిఒడ్డు కనపడందే?—

చివరికి క్రమంగా ఈ ఒడ్డు చేరాను. మన్నించండి. నాకు ఆట్టే పూర్వకవుల పద్యాలు రావు. వచ్చినా నా రూపంలాగే నా కంఠమూ వికారంగానే ఉంటుంది. అంత చక్కని ఉపన్యాసం విన్నాక నన్ను మాట్లాడమంటే ఏం తోచటం లేదు.

పూర్వకవిత్వం ఎలా బయలుదేరి, ఎలా విస్తరించి, ఎలా పరిణమించిందో తెలిస్తే గదా- తర్వాత భావ కవులు ఎక్కడ ప్రారంభించారో ఎలా విజృంభించారో చెప్పడానికి —

నేనూ శతావధానాలు చేశాను. శాలువలు సంపాదించాను. కాని ఆ పద్యాల్లో ఒక్కటీ ఇక్కడ చదవదగింది కనపడలేదు. ఒకసారి ఒకచోట ఒక తమాషా చేశాను. సభలో పండితపామరులు దండిగా కూర్చున్నారు. ఒక శార్దూలం ఎత్తాను. ఒయ్యారంగా ఊగుతూ - పద్యంలో ఒకటే సమాసం ఒత్తిఒత్తి చదువుతూ — ముగించాను. సభంతా చప్పట్లతో ఓహో కారాలతో నిండిపోయింది. ఆ ఘోషంతా అయిన తర్వాత సభవారిని ఒక ప్రశ్న వేశాను. 'ఈ పద్యంలో నేను చేసిన శిల్పం చమత్కారం చిత్తగించారా?'

ఈ ప్రశ్న వస్తుందని ఎవ్వరూ అనుకోలేదు.

అంతా తెల్లబోయి చూస్తున్నారు.

అప్పుడు నవ్వుతూ నేనన్నాను: "ఈ పద్యానికి అర్థంలేదు. వట్టి సమాసపు దూది కుక్కి ఈ శార్దూలాన్ని తయారు చేశాను. తమాషాకి. ఆ చదవడం ఊపులోపడి మీరు విస్తుబోయి చప్పట్లు కొట్టారు.

ఒకసారి దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఒక ప్రశ్న వేశాడట: "మంచినీళ్ళకు, సోడాకు తేడా ఏమిటి?"

చట్టున ఒకడు సమాధానం చెప్పాడు 'గాస్' అని. నా ఉపన్యాసం ఆ రెండో రకం.

కొంచెం ఘాటు విశేషం!

క్షమించండి—" అని కూర్చున్నాడు.

సభ పకపకలతో నిండిపోయింది!

★